కర్ణాటక మంత్రి హెచ్‌సీ మహదేవప్ప తన సెక్యూరిటీ సిబ్బందితో బూట్లు తొడిగించుకొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప ధార్వాడ్‌లోని ఓ హాస్టల్ తనిఖీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకొన్నది. మంత్రి హాస్టల్ కిచెన్‌లోకి బూట్లు లేకుండా వెళ్లారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయటకు వచ్చే క్రమంలో తన భద్రతా సిబ్బందిలో ఒకరి చేత బూట్లు తొడిగించుకొన్నారు. తనకు మోకాళ్ల నొప్పులు ఉండడంతో సెక్యూరిటీ సిబ్బంది సాయం చేశారని మంత్రి వివరణ ఇచ్చారు.

కర్ణాటకలో కమీషన్‌రాజ్!

- మంత్రి ప్రియాంక్ ఖర్గేపై తీవ్ర అవినీతి ఆరోపణలు
- కియోనిక్స్‌లో 12 శాతం కమీషన్ డిమాండ్
- లంచం ఇవ్వనిదే ముందుకు కదలని ఫైళ్లు
- సంస్థ ఎండీపై చిరు వ్యాపారుల ఆరోపణలు
- ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో ఎక్కడా చూడని లీలలు
- కంపెనీ ప్రారంభానికి ముందే 3.48 లక్షల టన్నులు రీసైక్లింగ్ చేసినట్టు అధికారుల ధ్రువీకరణ

బెంగళూరు, నవంబర్ 8: కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు అవినీతి కంపు కొడుతున్నది. తాజాగా రెండు భారీ అవినీతి కుంభకోణాలు బయటకు వచ్చాయి. అందులో ఒకటి ప్రతిష్ఠాత్మకమైన కర్ణాటక స్టేట్ ఎల్రక్ట్రానిక్స్ డైవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ది (కేఈవోఎన్ఐసీఎస్) కాగా, మరొకటి ప్లాస్టిక్ రీసైక్లింగ్ కుంభకోణం. ఈ బాగోతాలపై రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగుతున్నది.

బిల్లు రావాలంటే కమీషన్ కక్కాల్సిందే

కేఈవోఎన్ఐసీఎస్‌లో కమీషన్ల బాగోతం రాజకీయ రగడ సృష్టిస్తున్నది. రాష్ట్రంలోని ఐటీ, ఎల్రక్ట్రానిక్ సంస్థలకు ఈ సంస్థ మౌలిక వసతులు కల్పిస్తుంది. దీని పరిధిలో వందల మంది చిరు వ్యాపారులు పనిచేస్తున్నారు. వీరు చేసిన పనులకు సంబంధించి ప్రతి నెలా బిల్లులు సమర్పించి డబ్బు తీసుకొంటారు. ఈ సంస్థ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, మంత్రి ప్రియాంక్ ఖర్గే పరిధిలోనే ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సంగప్ప అనే ఐఏఎస్ అధికారిని ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయన అప్పటికే అనేక అవినీతి ఆరోపణలతో సస్పెండయ్యాడు. చిరు వ్యాపారులు సమర్పించే బిల్లుల మొత్తంలో 10-12 శాతం కమీషన్ ఇవ్వందే ఫైల్‌పై సంతకం పెట్టే ప్రసక్తే లేదని సంగప్ప తెగేసి చెప్తున్నారడని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమంటే.. తాను ఈ పోస్టు కొనుక్కొనేందుకు భారీ మొత్తంలో ముట్టజెప్పానని.. మరి ఆ డబ్బును రాబట్టుకోవాలి కదా అని అంటున్నారని కియానిక్స్ వెండార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్ బంగేరా తెలిపారు. ఎండీ వేధింపులను నిరసిస్తూ వ్యాపారులు గత శనివారం ధర్నా నిర్వహించారు. 'సంస్థలో ఓ మాఫియా మొదలైంది. ఎండీ పోస్టు కోసంభారీ మొత్తంలో ఖర్చు చేశానని, ఆ మొత్తాన్ని బిల్లుల్లో నుంచి కట్ చేసుకొంటానని ఎండీ సంగప్ప చెప్తున్నారు. ఈ వ్యాపారంలో మాకొచ్చేదే 5-6 శాతం లాభాలు. అంత మొత్తం లంచాలు మేము ఎక్కడి నుంచి తేవాలి?' అని వసంత్ ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తంగా ఈ కమీషన్ స్కెచ్ రూ.300 కోట్లు. ఒక్కో వ్యాపారి నుంచి కనీసం 10 శాతం కమీషన్ వసూలు చేసినా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న బిల్లుల కమీషన్ కలిపితే 300 కోట్లు అవుతుందట.



సీఎం సిద్ధరామయ్య

మంత్రి ప్రియాంక్ ఖర్గే

ఎండీ పోస్టు అమ్మిందెవరు?

కియోనిక్స్ కమీషన్ రాజ్‌పై దుమారం రేగుతున్నది. ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే కిందనే ఈ సంస్థ పనిచేస్తుంది. అంటే ఆయనకు తెలియకుండా ఎండీ నియామకం జరగదు. ఎండీ మరి ఆ పోస్టును ఎవరి దగ్గర కొన్నారు? ఈయనకు ఎవరు అమ్మారు? ఎంతకు అమ్మారు? ఇప్పుడు కర్ణాటకలో ఈ ప్రశ్నలే వినిపిస్తున్నాయి. ప్రతిపక్షాలతోపాటు ప్రజలు కూడా ఈ ప్రశ్నలకు ప్రియాంక్ ఖర్గే వైపే వేలు చూపిస్తున్నారు. పదవీ కాలం ముగిసే నాటికి ఎండీ ఎంత వసూలు చేస్తారో లెక్క దొరకటం లేదని సామాన్యులు పేర్కొంటున్నారు. ఇంత బాహాటంగా ఒక అధికారి కమీషన్లు వసూలు చేయటం మంత్రి, ఆ పై స్థాయి వ్యక్తుల అనుమతి లేకుండా సాధ్యం కాదని అంటున్నారు.

కంపెనీ పెట్టనే లేదు.. లక్షల టన్నుల రీసైక్లింగ్

కర్ణాటకలో ప్లాస్టిక్ కంపెనీలకు వాడేసిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ కోసం కర్ణాటక పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు ఇస్తుంది. ఎన్విరో రీసైక్లీన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కూడా ఓ సర్టిఫికెట్ ఇచ్చేసింది. అదేంటంటే సదరు సంస్థ ఏడాది కాలంలో 3.48 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తుందని. సర్టిఫికెట్ జారీ చేసిన 7 రోజుల్లో రీసైక్లింగ్ మొదలవుతుందని స్పష్టంగా రాశారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదుపై నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఆ సంస్థలో తనిఖీలు చేయగా.. అక్కడి చిత్రం చూసి అవాక్కయ్యారు. అక్కడ ప్లాంటు లేదు.. రీసైక్లింగూ లేదు. అంటే ఆ కంపెనీని తనిఖీ చేయకుండా రాష్ట్ర అధికారులు అనుమతులు ఇచ్చేశారు. కేంద్రం 2022లో ఈపీఆర్ నిబంధనలు జారీ చేసింది. దీని ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ విక్రయించిన మొత్తం ప్లాస్టిక్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30 శాతం రీసైక్లింగ్ చేయాలి. అందుకు అన్ని మౌలిక శాస్త్రీయ వసతులు ఉన్నట్టు రాష్ట్రాల పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు సర్టిఫికెట్లు జారీచేయాలి. నిబంధనలు అతిక్రమించిన సంస్థలకు భారీగా జరిమానా విధిస్తారు. కర్ణాటకలో పునాదులు వేస్తున్న సంస్థకు మూడున్నర లక్షల టన్నుల రీసైక్లింగ్ కోసం అనుమతులు ఇచ్చేశారు. దీంతో సదరు సంస్థకు టన్నుకు రూ.5 వేల చొప్పున పెనాల్టీ విధించాలని కేంద్ర అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ లెక్కన రూ.174 కోట్లు పెనాల్టీ పడుతుంది.



ఆదిత్య ఎల్1 మిషన్‌లో ఎక్స్-రేలో సౌరజ్వాల

న్యూఢిల్లీ : ఆదిత్య ఎల్1 సోలార్ ప్రోబ్ మిషన్‌లో ముఖ్యమైన మైలురాయి పూర్తయిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఓ ట్వీట్‌లో తెలిపింది. అత్యంత శక్తిమంతమైన సౌర జ్వాలను ఆదిత్య ఎల్1 ఎక్స్-రేలో బంధించింది. దీని తొలి పరిశీలన సమయం అక్టోబరు 29న 12.00 నుంచి 22.00. యూటీ మధ్యలో హై ఎనర్జీ ఎల్1 భూమిపై జీవాన్ని సౌర జ్వాలలు, ఇతర అంతరిక్ష వాతావరణ పరిస్థితులు ప్రభావితం చేస్తాయి. ఇవి పవర్ సిస్టమ్స్, శాటిలైట్ కమ్యూనికేషన్స్, రేడియో కమ్యూనికేషన్స్‌పై ప్రభావం చూపుతాయి.

కర్ణాటక రైతులపై నిర్లక్ష్యం.. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆగ్రహం



యశ్వంతరాయ గౌడ

బెంగళూరు : కర్ణాటకలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నిలదీస్తున్నారు. ఇండి ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మరీ తనదైన శైలిలో సీఎం తీరును ఎండగట్టారు. కరవు సహాయక చర్యలను సక్రమంగా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం కూడా సరైన విధంగా స్పందించడం లేదని మండిపడ్డారు. ఆల్మట్టి, నారాయణ్‌పుర జలాశయాల నీరు చిట్టచివరి భూములకు చేరడం లేదని, రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని చెప్పారు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌ఛార్జి మంత్రులు తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారని, ఇతర నియోజకవర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, తాము రాష్ట్రానికి మంత్రులమనే విషయాన్ని మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు రైతులకు ఎటువంటి సహాయాన్ని అందించడం లేదన్నారు.

ఫిబ్రవరిలో ఢిల్లీకి రైతుల పాదయాత్ర

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రైతులు ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని ఎస్కేఎం తాజాగా పిలుపునిచ్చింది. అంతకు ముందు రైతాంగ సమస్యలపై మహాపంచాయత్‌లు నిర్వహించాలని కోరింది. ఫిబ్రవరి 26న రైతులంతా పాదయాత్రగా ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చింది. కనీస మద్దతు ధర ఇవ్వాలని, రుణాలు రద్దు చేయాలని, విద్యుత్ రంగం ప్రైవేటీకరణను ఉపసంహరించాలని, 60 ఏండ్లు దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలని రైతు నేతలు డిమాండ్ చేశారు.

డిసెంబర్ రెండో వారంలో పార్లమెంటు సమావేశాలు!

న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఈ సమావేశాలు ప్రారంభమై, డిసెంబరు 25లోపు ముగుస్తాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లకు బదులుగా ప్రతిపాదించిన బిల్లులపై సమావేశాల్లో చర్చ జరుగవచ్చునని తెలిపాయి. వీటిపై మూడు నివేదికలను ఇటీవల హోం శాఖ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. ఎన్నికల కమిషనర్ల బిల్లు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నది.

నగదు చెలామణి తగ్గలేదు!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు చేసి ఏడేండ్లు అయింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామని మోదీ సర్కార్ చెబుతున్నప్పటికీ, దేశంలో నగదు వినియోగం ఇంకా భారీగానే ఉన్నది. ఆస్తులు, భూములు వంటి వాటి కొనుగోలు కోసం ప్రజలు నగదు రూపంలోనే చెల్లింపులు చేస్తున్నారని లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడైంది. సర్వే ప్రకారం.. భూమి లేదా ఆస్తిని కొనుగోలు చేసేందుకు 15 శాతం మంది 50 శాతానికి పైగానే నోట్ల రూపంలోనే చెల్లించారు. తమ చెల్లింపుల్లో నగదు భాగం 30-50 శాతం ఉన్నదని 18 శాతం మంది చెప్పారు. 10-30 శాతం మధ్య నగదు ఇచ్చామని 28% మంది పేర్కొన్నారు. అదే విధంగా నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం కూడా ప్రజలు నగదుపైనే ఆధారపడుతున్నారు. సర్వేలో పాల్గొన్న 11,189 మందిలో దాదాపు 56 శాతం మంది నిత్యావసరాల కోసం 5-25% వరకు నగదు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. 25-50 శాతం నగదు చెల్లింపులు చేస్తున్నామని 18 శాతం మంది తెలిపారు.

న్యాయవాద వృత్తిలో 73 ఏండ్లు

గిన్నిస్ రికార్డు సాధించిన కేరళ న్యాయవాది

తిరువనంపురం: న్యాయవాద వృత్తిలో కేరళకు చెందిన ఒక న్యాయవాది అరుదైన రికార్డు సాధించారు. పాలక్కడ్ జిల్లాకు చెందిన బాలసుబ్రమణియన్ మీనన్ 73 ఏండ్ల 60 రోజుల పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ సుదీర్ఘ కాలం న్యాయవాదిగా ఉన్నందుకు గిన్నిస్ రికార్డు సాధించారు. 1950లో యువకుడిగా ఉన్నప్పుడు న్యాయవాద వృత్తిలోకి వచ్చిన మీనన్ 97 ఏండ్ల వయసులో కూడా ఉత్సాహంగా కేసులు వాదిస్తున్నారు. తనకు ఆరోగ్యం సహకరించే వరకు ఈ వృత్తిలోనే కొనసాగుతానన్నారు.

భూమి వణుకుతున్నది.. కారణమిదే!

న్యూఢిల్లీ: మనం నివసిస్తున్న భూమి వణుకుతోంది. దీనికి కారణం వాతావరణ మార్పుల వల్ల భూకంప తరంగాలు ఉధృతమవుతుండటమేనని తాజా అధ్యయనం చెప్తున్నది. సముద్ర తరంగాలు పైకి ఎగసేటపుడు, కిందకు పడేటపుడు సముద్రపు అడుగు భాగంలో ఒత్తిడి తెస్తాయని, అప్పుడు భూకంప తరంగాలు ఏర్పడతాయని చెప్తున్నది. ఈ భూకంప తరంగాలు ఎంత తీవ్రంగా, విస్తృతంగా ఉంటాయంటే, స్థిరంగా ఝుమ్ అనే శబ్దం వస్తున్నట్లు ఉంటుంది. ఈ అధ్యయనంలో 1980 నుంచి 2022 వరకు ప్రపంచవ్యాప్తంగా నమోదైన 52 సిస్మోగ్రాఫ్‌లను పరిశీలించారు. ఇటీవలి దశాబ్దాల్లో ఈ తరంగాల సంకేతాలు మరింత తీవ్రంగా ఉన్నట్లు తెలిసింది.

10 రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

మానవ అక్రమ రవాణా కేసుల్లో 44 మంది అరెస్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఎన్ఐఏ బుధవారం దాడులు చేసింది. మానవ అక్రమ రవాణాతో సంబంధమున్న 44 మందిని అరెస్ట్ చేసింది. సరిహద్దు భద్రతా దళం, రాష్ట్ర పోలీసులతో కలిసి దాడులు నిర్వహించినట్టు ఎన్ఐఏ అధికారి ఒకరు తెలిపారు. ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా దేశంలోకి చొరబాట్లు, అక్రమ వలసలు, మానవుల అక్రమ రవాణా జరుగుతున్నదని, దీని నిరోధంలో భాగంగా ఈ దాడులు చేసినట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా తెలంగాణ, త్రిపుర, హర్యానా, రాజస్థాన్, తమిళనాడు, పుదుచ్చేరి, జమ్ము-కశ్మీర్ తదితర రాష్ట్రాలు, యూటీల్లోని 55 ప్రదేశాల్లో తనిఖీలు, దాడులు చేశామన్నారు.

'అదానీ కోసం అడ్డంగా పాలసీ మార్చారు'

న్యూఢిల్లీ : బొగ్గు బ్లాకుల వేలం పాలసీకి తిలోదకాలిచ్చిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దానిని అదానీకి అనుకూలంగా మార్చి వారికి లాభదాయకమైన బొగ్గు క్షేత్రాలను అప్పనంగా అప్పగించిందని కాంగ్రెస్ ఆరోపించింది. వేలం పాటలో ఒక్క అదానీ గ్రూప్ మాత్రమే ఉండటమో లేదా ఎవరైనా ఉన్నా వారు రెండో బిడ్డర్‌గా మాత్రమే ఉండేవారని, తద్వారా చాలా బొగ్గు గనులు అదానీకి ఏకపక్షంగా కట్టబెట్టారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు.

విమానంలో ఏపీ మహిళకు లైంగిక వేధింపులు

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): ఓ అంతర్జాతీయ విమానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 32 ఏండ్ల మహిళపై ఆమె పక్కన కూర్చొన్న తోటి ప్రయాణికుడు అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ నెల 6న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన లుఫ్తాన్సా విమానంలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు.. ఐపీసీ సెక్షన్ 354ఏ కింద కింద కేసు నమోదు చేశారు.

మహారాష్ట్రలో రిజర్వేషన్ల చిచ్చు

మరాఠాలకు ఇస్తే ఆందోళన.. ఓబీసీల హెచ్చరిక

డిసెంబర్ 24లోగా ఇవ్వాల్సిందే: మనోజ్ జరాంగే

మంత్రి ఛగన్ భుజ్‌బల్, మరాఠా ఉద్యమ నేత మనోజ్ జరాంగే

న్యూఢిల్లీ, నవంబర్ 8: మహారాష్ట్రలో ఓబీసీ రిజర్వేషన్లు రెండు వర్గాల మధ్య చిచ్చుకు దారి తీస్తున్నాయి. ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలన్న మరాఠాల ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గి వారిని ఓబీసీల్లో చేర్చడానికి యత్నిస్తుండగా, దానిపై ఓబీసీలు మండిపడుతున్నారు. మరాఠాలను కనుక ఓబీసీ కేటగిరీలో చేరిస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు. మరాఠాలకు కుంబీ కుల సర్టిఫికెట్ జారీ చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదిస్తే తాము కోర్టులను ఆశ్రయించడమే కాక ఆందోళనలు నిర్వహిస్తామని ఓబీసీలు ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు పలువురు ఓబీసీ నేతలు మంగళవారం మహారాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్ (అజిత్ పవార్ వర్గం)ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవడానికి రాష్ట్రంలోని వివిధ ఓబీసీ గ్రూపుల వారు ఏకతాటిపై నిలిచి రానున్న 20 రోజుల్లో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఒక పక్క మరాఠాలకు రిజర్వేషన్లు వద్దంటూ ఓబీసీలు ఒత్తిడి చేస్తుండగా, డిసెంబర్ 24లోగా మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనంటూ మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జరాంగే బుధవారం హెచ్చరించారు. మరాఠాలకు రిజర్వేషన్ల అంశంపై గతంలో మరాఠా నేతలే సహకరించేవారు కాదని, రిజర్వేషన్లు వద్దంటూ వారే గత 30-40 ఏండ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి కూడా తెచ్చారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం డిసెంబర్ 24లోగా రిజర్వేషన్లు కల్పించకపోతే రిజర్వేషన్లను అడ్డుకున్న మరాఠా నేతల పేర్లన్నింటినీ బయటపెడతానకి హెచ్చరించారు.

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- జడ్జీలకు పార్టీలతో కొంత అనుబంధం ఉండొచ్చు
- 'పిక్ అండ్ చూజ్' విధానానికి స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ : దేశ అత్యున్నత న్యాయస్థానానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య 'కొలీజియం' విషయంలో వివాదం కొనసాగుతున్నది. సుప్రీం కోర్టు సహా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల ఎంపిక సుప్రీంకోర్టు కొలీజియం ద్వారానే జరుగుతుంది. సుప్రీం కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం ఆమోదించాల్సి ఉంటుంది. నిజానికి ఇదో లాంఛన ప్రక్రియ అయినప్పటికీ కేంద్రం మాత్రం కొలీజియం సూచించిన పేర్లలో కొన్నింటికే ఆమోదం తెలపడం, మరికొన్నింటి విషయంలో పెండింగులో పెడుతుండడంపై జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ సుధాంశు ధులాయ్ కూడిన ధర్మాసనం కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 40 శాతం రాష్ట్రాలు ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్నాయన్న వాస్తవాన్ని కేంద్రం గుర్తించాలని, న్యాయాధికారుల పదవులను కలిగి ఉన్న వ్యక్తులకు పార్టీలతో కొంత అనుబంధం కలిగి ఉండొచ్చని భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. కొలీజియం ప్రతిపాదించిన లాయర్లు రాజకీయంగా క్రియాశీలకంగా ఉండకపోయినా అధికార పార్టీతోనో, ప్రతిపక్ష పార్టీతోనే సంబంధం కలిగి ఉండొచ్చని పేర్కొంది. ఓ క్రిమినల్ లాయర్ ప్రజల పక్షాన వాదించినంత మాత్రాన ఆయన ఇంకెవరికీ వ్యతిరేకం కాబోడని జస్టిస్ కౌశల్ స్పష్టం చేశారు. కాబట్టి 'పిక్ అండ్ చూజ్(కావాల్సిన వారిని ఎంపిక చేసుకోవడం)' విధానానికి స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

యూపీలో బైక్‌పై మృతదేహం తరలింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ దవాఖానల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఔరాయా జిల్లాలో అంజలి (20) అనే యువతికి కరెంట్ షాక్ తగలడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి తీసుకొచ్చారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి కొంత సేపటికి మరణించింది. అంబులెన్స్ లేకపోవడంతో మృతురాలి అన్న ఆమె మృతదేహాన్ని బైక్‌పై చున్నీతో వీపుకు కట్టుకొని తరలించాల్సి వచ్చింది.

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ బాంబే టాప్

ఆసియా యూనివర్సిటీల్లో 40వ స్థానం

ముంబై, నవంబర్ 8: బుధవారం విడుదలైన క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2024లో 'ఐఐటీ బాంబే' దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆసియా ఖండంలో 40వ ర్యాంకు దక్కించుకొన్నది. 100కు 67.2 స్కోరుతో ఐఐటీ బాంబే ఈ ఘనత సాధించింది. వివిధ ప్రామాణికాంశాల్లో ఐఐటీ బాంబే ఉత్తమ మార్కులు సాధించింది. అకడమిక్ రెప్యూటేషన్(నమ్మకం)లో 83.5, యాజమాన్య రెప్యూటేషన్‌లో 96, అంతర్జాతీయ రిసెర్చ్ నెట్‌వర్క్‌లో 66.3, అంతర్జాతీయ ఫ్యాకల్టీ నిష్పత్తిలో 11.1, పీహెచ్‌డీ ఉన్న అధ్యాపక సిబ్బంది అంశంలో అయితే 100కు 100 పాయింట్లు సాధించింది.

నోరు జారాను.. క్షమించండి!

మహిళలపై చేసిన వ్యాఖ్యలకు బీహార్ సీఎం నితీశ్ క్షమాపణ

పాట్నా, నవంబర్ 8: జనాభా నియంత్రణపై బీహార్ సీఎం నితీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. పలు రాజకీయ పార్టీల నేతలు ఆయన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశం కావటంతో సీఎం నితీశ్‌కుమార్ బుధవారం నష్టనివారణ చర్యలకు పూనుకున్నారు. 'నా మాటల్ని వెనక్కి తీసుకుంటున్నా. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణలు తెలుపుతున్నా. జనాభా నియంత్రణలో విద్య ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పటం నా ఉద్దేశం. అంతే తప్ప..ఎవర్నో కించపర్చాలన్నది నా ఉద్దేశం కాదు' అంటూ నితీశ్ వివరణ ఇచ్చుకున్నారు. ఇదిలా ఉండగా, ఆయనకు వ్యతిరేకంగా ముజఫర్‌పూర్ కోర్టులో ఫిర్యాదు నమోదైంది. దీనిపై ఈనెల 25న కోర్టు విచారణ చేపట్టబోతున్నది. సీఎం నితీశ్‌పై కఠినమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 'జాతీయ మహిళా కమిషన్' బీహార్ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ పంపింది. బీహార్ అసెంబ్లీలోనూ పలువురు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అయితే సీఎం నితీశ్ మాటల్ని వక్రీకరించకూడదని ఆర్జేడీ నేత, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మద్దతు పలికారు. ఇటీవల బీహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించి నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ 'భర్తల చర్యల వల్ల జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళలకు తన భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తున్నది' అని మాట్లాడారు.

సగటు భారతీయుడిని వేధిస్తున్న ఫేక్ మెసేజ్‌లు

న్యూఢిల్లీ : సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సమాచారం అనేక విధాలుగా చేరుతోంది. సగటు భారతీయుడిని రోజుకు కనీసం 12 నకిలీ మెసేజ్‌లు వేధిస్తున్నాయి. ఈ-మెయిల్, టెక్స్ట్, సామాజిక మాధ్యమాల ద్వారా వస్తున్న ఈ ఫేక్ మెసేజ్‌లను చదివి, నిర్ణయం తీసుకోవడానికి ఒక్కొక్కరు వారానికి కనీసం 1.8 గంటలు ఖర్చు చేస్తున్నారు. మెక్‌ఎఫీ నిర్వహించిన 'గ్లోబల్ స్కామ్ మెసేజ్' అధ్యయనంలో పాల్గొన్న భారతీయుల్లో 82 శాతం మంది ఫేక్ మెసేజ్‌లపై క్లిక్ చేసినట్లు తెలిపారు. మెసేజ్‌లు నమ్మదగినవిగానే కనిపిస్తాయని, స్పెల్లింగ్ మిస్టేక్స్ వంటివేవీ ఉండవని 49 శాతం మంది చెప్పారు. ఫేక్ జాబ్ నోటిఫికేషన్స్ బారిన పడ్డామని 64 శాతం మంది చెప్పగా, బ్యాంక్ అలెర్ట్ మెసేజెస్ బుట్టలో పడ్డామని 52 శాతం మంది తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల స్కామ్‌లు కూడా ఆధునికతను సంతరించుకోవడంతో, ప్రపంచంలోని వినియోగదారులపై ఎలా ఉందో ఈ అధ్యయనంలో పరిశీలించారు. భారత్ సహా మొత్తం ఏడు దేశాల్లో ఈ అధ్యయనం జరిగింది.

వచ్చే ఏడాది మరింత వేడి

ఏప్రిల్ 2024 వరకు ఎల్‌నినో : డబ్ల్యూఎంవో

న్యూఢిల్లీ : ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు ఏప్రిల్, 2024 వరకు కొనసాగుతాయని, దీంతో భూ ఉపరితలం, సముద్ర జలాలపై ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చునని 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంవో) తాజాగా వెల్లడించింది. 'జూలై-ఆగస్టులో ఎల్‌నినో మార్పులు వేగాన్ని అందుకున్నాయి. నవంబర్‌లో బలంగా మారి, జనవరి 2024 నాటికి ఎల్‌నినో అత్యంత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఉత్తరార్ధ గోళంలో శీతాకాలంలో, దక్షిణార్ధ గోళంలో వేసవికాలంలో ఎల్‌నినో పరిస్థితులు కొనసాగే అవకాశం 90 శాతం వరకు ఉన్నాయి' అని డబ్ల్యూఎంవో తన అంచనాల్ని విడుదల చేసింది. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలపై ఉంటుందని తెలిపింది. అత్యంత వేడి సంవత్సరంగా 2023 రికార్డ్ సృష్టించగా, 2024లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని అంచనా వేసింది. అత్యంత వేడిగాలులు, కరువు పరిస్థితులు, అడవుల్లో కార్చిచ్చు, హఠాత్తుగా కుండ